క్లుప్తంగా

నేడు ద్విచక్ర వాహనం వేలం

నకిరేకల్ : ఓ కేసులో సీజ్ చేసిన ద్విచక్ర వాహనానికి సోమవారం వేలం పాట నిర్వహించనున్నట్లు నకిరేకల్ ఎక్సైజ్ సీఐ మల్లయ్య తెలిపారు. వేలంలో పాల్గొనదలిచిన వారు ఉదయం 10 గంటలకు నకిరేకల్ ఎక్సైజ్ కార్యాలయంలో రూ.10 వేలు డిపాజిట్ చేసి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ : మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ ఇంగ్లిష్ పోస్ట్ కోసం అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటేశం ఆదివారం తెలిపారు. స్థానిక నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ ఉత్తీర్ణత గల వారు తమ సర్టిఫికెట్‌లతో ఈ నెల 10లోపు నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. డెమో క్లాసులు నిర్వహించి ఎంపిక చేస్తామని, రూ.18,200 వేతనం ఇస్తారని తెలిపారు.

విత్తనాలు చల్లిన పర్యావరణ ప్రేమికులు



నకిరేకల్ శివారులో విత్తనాలు చల్లుతున్న పర్యావరణ ప్రేమికులు

నకిరేకల్ : పట్టణానికి చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రేమికులు కొన్ని నెలలుగా క్యాసియో, ఫెస్టిలా, గుల్మోర, అల్లనేరెడు, మామిడి, కానుగు, వేప, సీతాఫలం, సపోటా తదితర విత్తనాలు సుమారు 10 వేల వరకు సేకరించారు. ఆదివారం నకిరేకల్, శాలిగౌరారం, కేతేపల్లి మండలాల్లోని గుట్టల వెంబడి చెట్లు తక్కువగా ఉన్న ఖాళీ ప్రదేశాల్లో ఆ విత్తనాలను చల్లారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పర్యావరణ ప్రేమికులు బ్రహ్మదేవర నరేష్, కర్నాటి నరేష్, గుండు విక్రమ్ తెలిపారు.

ఓటరు జాబితాపై నేడు సమావేశం

మునుగోడు: ఇటీవల విడుదల చేసిన ఎన్నికల ఓటరు జబితా, పోలింగ్ కేంద్రాల వివరాలపై చర్చించేందుకు సోమవారం మునుగోడు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యుగేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు పాల్గొని ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ఎంపికలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు.

విద్యుదాఘాతంతో కోడె దూడ మృతి

శాలిగౌరారం: విద్యుత్ షాక్‌కు గురై కోడె దూడ మృతిచెందిన సంఘటన మండలంలోని జాలోనిగూడెం గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన జమ్ము అశోక్ అనే రైతు రోజువారి మాదిరిగా తన పశువులను వ్యవసాయ బీడుభూమిలో మేపుతుండగా కోడె మేత మేసుకుంటూ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. ఈక్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. కోడె విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

నష్టపరిహారం చెల్లించాలని రైతుల ఆందోళన



నిరసన తెలుపుతున్న తేరట్‌పల్లి గ్రామస్తులు

గట్టుప్పల్ : రీజనల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని, 2013 చట్టాన్ని అమలు చేసి నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బండ శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రీజనల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులతో కలిసి ఆదివారం గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్‌పల్లి గ్రామంలో నిరసన తెలిపే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎం నాయకులు పగిళ్ల శ్రీనివాస్, అచ్చిన శ్రీనివాస్, వల్లూరి శ్రీశైలం, మల్లే శివ, బండారి కృష్ణయ్య, పబ్బు మారయ్య, కట్ట కృష్ణయ్య, సత్తయ్య, రాములు, అచ్చిన బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

నకిరేకల్ : వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రసేన గుప్తా జయంతి ఉత్సవాల్లో భాగంగా నకిరేకల్‌లోని వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో ఆదివారం మానసిక దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ఐపీసీ దేవరశెట్టి సత్యనారాయణ, జోన్ చైర్మన్ గుండా నరేందర్, క్లబ్ అధ్యక్షుడు తేలుకుంట్ల రాజు, ఉపాధ్యక్షుడు కందగట్ల బాలాజీ, ప్రధాన కార్యదర్శి శ్రీకాకోళ్ల వెంకన్న, కోశాధికారి బ్రహ్మదేవర వేణు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ లింక్ రోడ్లు

- అభివృద్ధికి నోచుకోక ఆనవాళ్లు కోల్పోతున్న రహదారులు
- భారీ గుంతలతో ప్రయాణానికి ఇబ్బందులు

శాలిగౌరారం: దశాబ్దాలు గడిచినా గ్రామాల మధ్య లింక్ రోడ్ల పరిస్థితి మారలేదు. లింక్ రోడ్లు అధ్వానంగా ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. శాలిగౌరారం మండలంలో లింక్ రోడ్లు అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఆనవాళ్లు కోల్పోతున్నాయి. వర్షాకాలంలో ఆ రోడ్లపై ప్రయాణించడం కత్తిమీద సాములాగానే ఉంటోంది. కంకర తేలి, గుంతలమయంగా మారడంతోపాటు వరద నీటికి కోతకు గురై ఆ రోడ్లపై నడవలేని దుస్థితి ఏర్పడింది.

వర్షాలకు కోతకు గురి కావడంతో..

శాలిగౌరారం మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామపంచాయతీల పరిధిలో 21 లింక్ రోడ్లు ఉన్నాయి. ఈ రోడ్లన్నీ పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉన్నాయి. అందులో వల్లాల–జోలంవారిగూడెం లింక్ రోడ్డును మాత్రమే రూ.2.50 కోట్లతో ప్రస్తుతం బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు. మిగిలిన 20 లింక్ రోడ్లు అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా మారాయి. అందులో ప్రధానంగా ఊట్కూరు–బండమీదిగూడెం, శాలిలింగోటం–తుడిమిడి, అంబారిపేట–చిత్తలూరు, అడ్లూరు–పెర్కకొండారం, వల్లాల–అడింబావిగూడెం, వల్లాల–చెర్వుఅన్నారం, ఆకారం – తక్కెళ్లపహాడ్, భైరవునిబండ–అడ్డెలోనిబావి, భైరవునిబండ–రామాంజాపురం, ఎన్‌జీ కొత్తపల్లి–జాలోనిగూడెం, శాలిగౌరారం–రామగిరి లింక్‌రోడ్లు అత్యధికంగా వినియోగంలో ఉన్నాయి. ఆయా గ్రామాల మధ్య ప్రజల రాకపోకలకు ఈ లింక్ రోడ్లు ప్రధానంగా మారాయి. ఆయా లింక్ రోడ్లలో ఊట్కూరు–బండమీదిగూడెం లింక్‌రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షానికి కోతకు గురై నడవడానికి కూడా వీల్లేకుండా మారింది. అదేవిధంగా అంబారిపేట–చిత్తలూరు, వల్లాల–చెర్వుఅన్నారం లింక్‌రోడ్లు ఆనవాళ్లను కోల్పోతున్నాయి. మిగిలిన లింక్ రోడ్లన్నీ భారీ గుంతలతో వాహనాలు వెళ్లలేని దుస్థితికి చేరుకున్నాయి. ద్విచక్ర వాహనాలు మినహా ఏ ఇతర వాహనాలు లింక్‌రోడ్లపై ప్రయాణించలేని విధంగా మారాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి లింక్ రోడ్లను అభివృద్ధి చేయాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలి అధ్వానంగా ఉన్న ఊట్కూరు-బండమీదిగూడెం లింక్‌రోడ్డు



ఆనవాళ్లు కోల్పోయిన అంబారిపేట-చిత్తలూరు లింక్‌రోడ్డు



గుంతలమయంగా మారిన ఆకారం - తక్కెళ్లపహాడ్ లింక్‌రోడ్డు

గుంతలమయంగా మారాయి



గ్రామాల మధ్య రాకపోకలు పెంపొందించేందుకు లింక్‌రోడ్లను అభివృద్ధి చేయాలి. లింక్ రోడ్లు ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోకపోవడంతో పూర్తిగా గుంతలమయంగా మారాయి. ప్రయాణ సమయంలో ఎక్కడ ద్విచక్ర వాహనం కింద పడుతుందోనని భయమేస్తుంది.

– జవాజి నాగరాజు, ఆకారం

రోడ్లు ఆనవాళ్లు కోల్పోతున్నాయి



గ్రామాల మధ్య లింక్ రోడ్లు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. దీంతో ప్రజలు ఇతర గ్రామాలకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం లింక్ రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలి. లింక్ రోడ్ల అభివృద్ధితో ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపడతాయి.

– చలకాని మల్లయ్య, అంబారిపేట

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

నకిరేకల్ : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్ రేట్లు తగ్గించడంపై హర్షం వ్యక్తం చేస్తూ నకిరేకల్‌లో బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గర్రె మురళీమోహన్, కార్యదర్శి పందాల సైదులు, చినేని జానయ్య, బోనగిరి వెంకటేశ్వర్లు, అప్పం అంజయ్య, నడికుడి సైదులు, సందుపట్ల వేణుమాధవ్, కారింగుల యాదగిరి, ఏర్పుల రేణుక, మిర్యాల గణేశ్, ఉపేంద్రచారి, నక్క శివ పాల్గొన్నారు.

కేతేపల్లి: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం కేతేపల్లిలో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్‌రెడ్డి, అయితగోని అనిత, తాడోజు నర్సింహాచారి, కె.వెంకటేశ్వర్లు, సమ్మెట విజయలక్ష్మి, పద్మ, లింగాల సత్తయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: జీఎస్టీ తగ్గింపుపై హర్షం వ్యక్తం చేస్తూ చిట్యాల మండలం వనిపాకల గ్రామంలో ఆదివారం బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో చిట్యాల మండల బీజేపీ అధ్యక్షుడు పీక వెంకన్న, మండల మాజీ అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పున్న విష్ణు, వరికుప్పల నర్సింహ, ఉయ్యాల లింగస్వామి, బూత్ అధ్యక్షుడు పీక వెంకన్న, గంట మల్లేష్, కోరబోయిన లింగస్వామి, సత్యనారాయణ, శివకోటి లింగయ్య, శివకోటి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



కేతేపల్లి : ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కరాటే నేర్చుకునేలా ప్రోత్సహించాలి

నల్లగొండ టూటౌన్: విద్యార్థులు చదువుతోపాటు కరాటే నేర్చుకునేలా వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, వైద్యుడు డాక్టర్ సీహెచ్ పుల్లారావు అన్నారు. ఆదివారం నల్లగొండలోని వెంకటేశ్వర కాలనీలో నాగార్జున కరాటే అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్టు గ్రేడింగ్ టెస్ట్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఆత్మ రక్షణలో కరాటేది కీలక పాత్ర అన్నారు. వైట్ బెల్టు నుంచి బ్లాక్ బెల్టు వరకు కరాటే పోటీలు నిర్వహించారు. బ్లాక్ బెల్ట్ విభాగంలో పి.అన్విత, అభిలాష, సహస్ర గెలుపొందగా, బ్రౌన్ బెల్ట్ వన్ విభాగంలో సాయి చరణ్, మౌనిక, సచేతన్‌లు గెలుపొందారు. అనంతరం విజేతలకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కరాటే జిల్లా అధ్యక్షుడు నగేష్, సెక్రటరీ నాగార్జున, మాస్టర్ సోములు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లతో కరాటే క్రీడాకారులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఉరుమడ్ల హైస్కూల్ పూర్వ విద్యార్థులు

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల జెడ్పీహెచ్ఎస్‌లో 2000–01 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సీ చదివిన విద్యార్థులు ఆదివారం చిట్యాల పట్టణ శివారులోని ఓ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆనాడు చదువు చెప్పిన ఉపాధ్యాయులు లక్ష్మీనర్సింహారావు, సాంబయ్య, యోగేంద్రనాథ్, నర్సింహారెడ్డి, నారాయణ, రవీందర్‌లను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

వారోత్సవాలను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 11నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. ఆదివారం నల్లగొండలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయుధ పోరాట చరిత్ర కలిగిన చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో అమరవీరుల స్తూపం వద్ద సాయుధ పోరాట వారోత్సవాలు ప్రారంభిస్తామన్నారు. అదేవిధంగా ఈ నెల 10న మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను నల్లగొండలో నిర్వహిస్తామని.. పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లోడంగి శ్రవణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరాస్వామి, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు, బొల్లూరి నరసింహ, తిర్పారి వెంకటేశ్వర్లు, ఆర్.అంజచారి, తూము బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ఎమ్మెల్యే పరామర్శ

నార్కట్‌పల్లి : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లింగాల రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన చిత్రపటానికి ఆదివారం ఎమ్మెల్యే వేముల వీరేశం పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా, మండల పరిధిలోని శాపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సిద్దగోని స్వామి సోదరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, సట్టు సత్తయ్య, దూదిమెట్ల సత్తయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, జేరిపోతుల భారత్, గడ్డం పశుపతి, నిమ్మనగంటి లింగయ్య, వెంకన్న, గోలి సాగర్‌రెడ్డి, జాల ముకుందం, కర్నాటి నర్సయ్య, సాగర్ల యాదయ్య, ఇద్దయ్య, బింగి కొండయ్య, మహేష్, వలిజాల శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఘనంగా అన్నమయ్య దశమ వార్షికోత్సవం



అన్నమయ్య కళా సమితి అధ్యక్షురాలు సుమలతను సన్మానిస్తున్న గురువులు

నకిరేకల్ : జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు సొంతం చేసుకున్న నకిరేకల్ అన్నమయ్య కళా సమితి ఆధ్వర్యంలో నకిరేల్‌లో ఆదివారం అన్నమయ్య పద సమార్చన దశమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు దాదాపు 12 గంటల పాటు నిర్విరామంగా అన్నమాచార్య సంకీర్తనలు గానం చేశారు. హైదరాబాద్, కరీంనగర్, పలు ప్రాంతాల్లోని వారు కూడా ఆన్‌లైన్‌లో 70 మంది విద్యార్థులు 120 సంకీర్తనలు గానం చేశారు. అన్నమయ్య కళా సమితి అధ్యక్షురాలు గండేపల్లి సుమలత ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు డాక్టర్ బింగి నరేందర్‌గౌడ్, ప్రముఖ సంగీత దర్శకులు సాలూరి వాసూరావు, సంగీత గురువులు ప్రభాకర్, పురుషోత్తమచార్యులు, గందం బసవ శంకర్‌లు ముఖ్య అతిథిలు హాజరై వీక్షించారు. ఈ వేడుకల్లో గానం చేసిన వారందరికీ బహుమతులు అందజేశారు.



బహుమతులతో గాయకులు

యూరియా కోసం రైతులకు తప్పని తిప్పలు

శాలిగౌరారం: యూరియా కష్టాలు రైతులను ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. రోజులు గడుస్తున్నా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో రైతులు ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిలబడి పడిగాపులుగాస్తున్నారు. శాలిగౌరారం మండలానికి ఆదివారం 66 మెట్రిక్ టన్నుల(1465 బస్తాలు) యూరియా వచ్చింది. అందులో పెర్కకొండారం ఆగ్రో రైతు సేవా కేంద్రానికి 20 టన్నులు, శాలిగౌరారం ఆగ్రో రైతుసేవా కేంద్రానికి 10 టన్నులు, సాయికృష్ణ ఫర్టిలైజర్‌కు 16 టన్నులు, సాయినాథ్ ఫర్టిలైజర్‌కు 10 టన్నులు, ఆకారంలో ఓ ఫర్టిలైజర్‌కు 10 టన్నుల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు ఉదయం ఆరు గంటల నుంచే ఆయా కేంద్రాల వద్ద యూరియా కోసం క్యూలైన్ కట్టారు. మండల వ్యవసాయ అధికారి సౌమ్యశృతి సిబ్బందితో ఉదయం 7.30 గంటలకే ఆయా కేంద్రాలకు చేరుకుని రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా అందించారు. దీంతో లైన్‌లో నిలుచున్న పలువురు రైతులకు యూరియా అందకపోవడంతో అనేక మంది నిరాశతో వెనుదిరిగిపోయారు. ఒకటి, రెండు రోజుల్లో యూరియా సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని మండల వ్యవసాయ అధికారి సౌమ్యశృతి తెలిపారు.



శాలిగౌరారంలో యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో రక్తదానం

రామగిరి(నల్లగొండ): మిలాద్ ఉల్ నబీ సందర్భంగా ఆదివారం నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని నల్ల గొండ డీఎస్పీ శివ రాంరెడ్డి ప్రారంభించారు. ముస్లింలు స్వచ్ఛందంగా హాజరై రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ మల్లారెడ్డి, నల్లగొండ మిలాద్ కమిటీ అధ్యక్షుడు మసీయుద్దీన్, కార్యదర్శి అబిద్, సీఐ రాజశేఖర్ రెడ్డి, వేణుగోపాల్, గౌస్ మోహినుద్దీన్ హాశం, జాఫర్, సయ్యద్ హాశం, మొహితుల్లా, డాక్టర్ ఏఏ ఖాన్, జునైద్ హస్మి, షరీపుద్దీన్, ఎండీ అలీముద్దీన్, ఎండీ ఇమ్రాన్, ఫసియుద్దీన్, ఉమేర్, నర్సిరెడ్డి, బ్లడ్ బ్యాంక్ వలంటీర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ముస్లింలు

పంచాయతీరాజ్ పనులపై పర్యవేక్షణ ఏదీ!

- దాదాపు ఏడాదిగా ఇన్‌చార్జ్‌కే బాధ్యతలు
- ఆలస్యంగా ఎంబీలు
- నిలిచిపోతున్న అభివృద్ధి పనులు

నార్కట్‌పల్లి: మండలానికి రెగ్యులర్ పంచాయతీరాజ్ ఏఈ లేకపోవడంతో పర్యవేక్షణ కరువై అభివృద్ధి పనులు నాణ్యత లేకుండా జరుగుతున్నాయి. పీఆర్ ఏఈగా పనిచేసిన పల్లా మోహన్ 2024 ఆగస్టులో బదిలీపై వెళ్లాడు. రెండు నెలలు అసిస్టెంట్ ఏఈ మల్లికార్జున్‌కు బాధ్యతలు అప్పగించారు. అనంతరం శాలిగౌరారం పీఆర్ ఏఈ భరత్ చంద్రకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. నేటికీ పది నెలలు గడుస్తున్నా రెగ్యులర్ ఏఈ లేకపోవడంతో అభివృద్ధి పనుల్లో పూర్తిస్థాయి పర్యవేక్షణ లేకుండా పోతోంది. చెరువుగట్టు బ్రహ్మోత్సవాల సమయంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రోడ్లకు మట్టి పోసే పనుల్లో పనులు అవినీతి జరిగిన విషయం తెలిసిందే. మండలంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులకు సరైన సమయంలో ఎంబీలు కాక పంచాయతీ కార్యదర్శులు, కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇన్‌చార్జ్ ఏఈ అప్పుడప్పుడు వచ్చి పనులను పరిశీలిస్తున్నారు. జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకుని మండలానికి రెగ్యులర్ పీఆర్ ఏఈని నియమించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై డీఈ మహేష్‌ను వివరణ కోరగా.. జిల్లాలో పీఆర్ ఏఈ పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల అదనపు బాధ్యతలు శాలిగౌరారం ఏఈకి ఇచ్చామని తెలిపారు. నార్కట్‌పల్లి మండలానికి రెగ్యులర్ ఏఈ నియమించాలని జిల్లా అధికారులకు వివరించానని తెలిపారు.

శిథిల గదిలో హోమియోపతి వైద్యం

మునుగోడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన హోమియోపతి వైద్యశాల పూర్తిగా శిథిలమైన గదిలో కొనసాగిస్తున్నారు. 60 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో పూర్తిగా శిథిలమై వర్షం వస్తే కురుస్తోంది. గోడలు పెచ్చులూడి ఆస్పత్రి ఆవరణ అంతా దుమ్ముతో నిండిపోయింది. ఆస్పత్రి భవనం శిథిలం కావడంతో చికిత్స చేయించుకునేందుకు వచ్చే రోగులు భయపడుతున్నారు. ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది కూడా రోజూ భయపడుతూ విధులు నిర్వర్తిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని హోమియోపతి ఆస్పత్రికి పక్కా భవనం కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలమైన గదిలో కొనసాగుతున్న హోమియోపతి వైద్యశాల





నల్లగొండ పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంపై చంద్రగ్రహణం



మసీదుపైన..



చర్చిపైన..

చంద్రగ్రహణంతో ఆలయాలు మూసివేత

నార్కట్‌పల్లి : సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నార్కట్‌పల్లి మండలంలోని పలు ఆలయాలను మూసివేశారు. చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయం, గోపలాయపల్లి గ్రామ సమీపాన గల శ్రీవారిజాల వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి నివేదన అనంతరం ఉపాలయముల ద్వారబంధనములను ఆయా ఆలయ అర్చకులు చేశారు. తిరిగి సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం, ఆర్జిత సేవలు నిర్వహించనున్నట్లు చెర్వుగట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి నవీన్‌కుమార్, శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి ఆలయ అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు.

కనగల్: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని మధ్యాహ్నం ఆలయ ప్రధాన అర్చకులు నాగోజు మల్లాచారి, చిలకమర్రి శ్రవణ్ కుమారాచార్యుల ఆధ్వర్యంలో మూసివేశారు. అనంతరం అర్చకులు మాట్లాడుతూ సోమవారం ఉదయం ఆలయంలో సంప్రోక్షణ శుద్ధి చేసిన అనంతరం ఆలయాన్ని తెరుస్తారని తెలిపారు.



నార్కట్‌పల్లి చెర్వుగట్టు ఆలయ ద్వారబంధనం చేస్తున్న అర్చకులు



కనగల్: రేణుకా ఎల్లమ్మ ఆలయ గర్భగుడి తలుపులకు తాళం వేస్తున్న అర్చకులు

పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించాలి

నల్లగొండ టౌన్: జిల్లాలో పెండింగులో ఉన్న కార్మికుల క్లెయిమ్స్‌ను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలోని సుందరయ్య భవనంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాళీగా ఉన్న ఏఎల్‌ఓ, ఏసీఎల్ ఇతర సిబ్బంది నియమాకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు ద్వారా 60 సంవత్సరాలు పైబడిన కార్మికులకు రూ.9 వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పోలె సత్యనారాయణ, దోటి పరమేశ, సీఐటీయూ పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, గాదె యాదయ్య, దోటి పరమేశ, బొల్లం సత్తయ్య, మల్లెబోయిన వెంకన్న, ఉప్పునూతల వెంకన్న, జాగటి మురళి, పోలె ప్రేమయ్య, కొత్తపెల్లి కృష్ణ, లింగస్వామి, వెంకన్న, రవి పాల్గొన్నారు.